క్లుప్తంగా

ధర్మవరం వాసులకు జాతీయ సమైక్యత అవార్డు

ధర్మవరం అర్బన్: జాతీయ సమైక్యత అవార్డుకు ధర్మవరం వాసులు ఎంపికైనట్లు రచయితల సంఘం ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి డాక్టర్ సత్య నిర్ధారన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పెనుకొండ దర్గా కమిటీ వారు జాతీయ సమైక్యత అవార్డుకు పట్టణానికి చెందిన జయసింహ, పోలా ప్రభాకర్, నరేంద్రరెడ్డిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. వీరికి శుక్రవారం పెనుకొండలో అవార్డులను అందించనున్నారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో 'ఇరుముడి'



ఇరుముడితో కసాపురం బయలుదేరిన మాలధారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గీతానగర్ రామాలయంలో గురువారం హనుమాన్ మాలధారుల ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా గురుస్వాములు నాగభూషణం, యుగేంద్ర, గుర్రం నాగరాజు మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం 80 మంది మాలధారులు కసాపురం బయలుదేరి వెళ్లారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తనకల్లు: మండలంలోని సీఆర్‌పల్లికి చెందిన ఝాన్సీ మహిళ సమాఖ్య సంఘం వీఓ లీడర్ పీ. రత్నమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులను తెలుసుకున్న ఇతర సభ్యులు గురువారం మృతురాలి కుటుంబానికి రూ.10 వేలు నగదు అందజేశారు.

ఎర్త్‌వైర్ ఏర్పాటు చేయండి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌పైపు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది.

తలుపుల: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ వైర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈ శివతేజ విద్యుత్ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ పైపులు ఏర్పాటు చేయించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తరచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్త్ వైర్ ఏర్పాటు చేస్తే కాలిపోకుండా ఉండటంతోపాటు విద్యుత్ సరఫరాలో ఆటంకం ఉండదన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌కు సన్మానం



హెడ్‌కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడిమర్రి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్ గణేష్ కుమార్‌ను ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది గురువారం సన్మానించారు. ఈసందర్భంగా ఎస్ఐ గణేష్ కుమార్ సేవలను కొనియాడారు. ఏఎస్ఐ ఆనంద్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేత



కుట్టుమిషన్లు అందిస్తున్న ఆర్డీఓ, ట్రస్ట్ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ ఇద్దరు పేద మహిళలకు రెండు కుట్టు మిషన్లను అందజేశారు. చిలమత్తూరు మండలం కోడూరుకు చెందిన నందిని, పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన షబానా ఇద్దరికీ మాటలు రావు. దీంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. విషయం తెలుసుకున్న పుట్టపర్తికి చెందిన ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు షామీర్‌కు కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు షాకీర్, రామాంజి, షమీఉల్లా, జావీద్, గంగాద్రి తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

ఎన్పీకుంట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఈఓపీఆర్డీ మాధవరెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, అందరికీ విద్య అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాలు కురుస్తున్నందున దోమలు ప్రబల కుండా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

సాగునీటి ఎన్నికలపై కూటమి కుట్రలు



గొట్లూరు చెరువు

- రేపు సాగునీటి సంఘం ఎన్నికలు
- సమాయత్తం అవుతున్న అధికారులు
- ఏకగ్రీవం చేసేందుకు కూటమి నాయకులు కుయుక్తులు

ధర్మవరం రూరల్: ధర్మవరం నియోజకవర్గంలో సాగునీటి సంఘం ఎన్నికలు సజావుగా జరుగకుండా అధికారులు, కూటమి నాయకులు కుయుక్తులు చేసి కూటమి అభ్యర్థుల ఏకగ్రీవానికి కుట్రలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత నెల 21న జరగాల్సిన ఈ ఎన్నికలు ఈ నెల 14వ తేదీకి వాయిదా వేయడంతో ఆశావాహులు ఈ పదవులు దక్కించుకోవడానికి తహతహలాడిపోతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేసిన అధికారులు ఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతున్నారు.

కూటమి ప్రభుత్వంపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత

కూటమి ప్రభుత్వంపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేటికీ రైతుల ఖాతాల్లోకి ఒక్కపైసా జమ చేయలేదు. అదే విధంగా ఈ ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదు. పంటల బీమా ప్రీమియం కూడా రైతులే చెల్లించాల్సి రావడం, అలాగే ఎరువుల ధరలను అమాంతం పెంచేయడం వంటి కారణాలతో ప్రభుత్వంపై వారిలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వారి వ్యతిరేకతను గుర్తించిన కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల్లో కుట్రలు చేసి కూటమి నాయకులు బలపర్చిన అభ్యర్థులను ఏకగ్రీవం చేసుకోవడానికి గ్రామాల్లో కుయుక్తులు పన్నుతున్నారు.

కూటమి నాయకుల బెదిరింపులు

ధర్మవరం నియోజకవర్గంలో జరుగుతున్న సాగునీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా అని కొంత మంది రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కేవలం ఆయకట్టు కింద భూములున్న వారు మాత్రమే పాల్గొనాల్సి ఉంటుంది. అయితే ఈ ఎన్నికల్లో తమ అనుకూలమైన వారినే ఏకగ్రీవంగా ఎంపిక చేయాలని కూటమి నాయకులు కొంత మంది రైతులను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. బెదిరింపుల నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న వారు కాస్త వెనకడుగువేస్తున్నట్లు తెలుస్తోంది.

కూటమి నాయకుల్లో తీవ్ర పోటీ

సాగునీటి సంఘం ఎన్నికలతో రైతుల ప్రయోజనాలు, చెరువుల అభివృద్ధి ఎలా ఉన్నా, చెరువుల నుంచి వచ్చే ఆదాయంపై నాయకులు దృష్టి సారించారు. ముఖ్యంగా ధర్మవరం, గొట్లూరు, పోతుకుంట, రేగాటిపల్లి, రావులచెరువు, అప్రాచెరువు తదితర చెరువుల్లో చేపల పెంపకంతో పాటు గరుసు మట్టిని పట్టణానికి తరలించడం ద్వారా సొమ్ము చేసుకోవచ్చుననే ఉద్దేశంతో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల కోసం కూటమి నాయకుల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. అందులో భాగంగా తమ మద్దతుదారులకే పదవులు కావాలంటు అధినాయకులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం.

ధర్మవరం నియోజకవర్గంలోని చెరువులు, ఓటర్ల వివరాలు..

చెరువులు	ఓటర్లు
ధర్మవరం	3,164
గొట్లూరు	695
రావులచెరువు	463
సీసీ కొత్తకోట	294
రేగాటిపల్లి	311
పోతుకుంట	278
కట్టకిందపల్లి	244
చింతలపల్లి	287
అప్రాచెరువు	400
దంపెట్ల	81
ఎం.అగ్రహారం	132

అదే విధంగా ముదిగుబ్బ మండలంలో 5 చెరువులకు గాను 720 మంది ఓటర్లున్నారు.

పురుగుల అన్నం పెడుతున్నారని ధర్నా



రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

కదిరి అర్బన్: స్థానిక గిరిజన గురుకుల పాఠశాల(బాలురు)లో పురుగులు ఉన్న అన్నం పెడుతున్నారని గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు కదిరి–అనంతపురం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ అన్నం బాగాలేదని విద్యార్థులు అడిగితే మీకు ఇష్టమైన చోట చెప్పుకోండని సిబ్బంది బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మెనూ ప్రకారం, సమయానికి అన్నం పెట్టకుండా వారికి ఇష్టం వచ్చినప్పుడు మాత్రమే పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నరసింహ, అవినాష్, ప్రదీప్, పృథ్వీ, రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు భగవాన్, రాధాలు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులే భారతదేశ భవిష్యత్తు అన్నారు. నైతిక విలువలు జీవితంలో అన్ని నిర్ణయాలకు మార్గం సుగమం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి చేయూతనివ్వండి

కనగానపల్లి: గ్రంథాలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందించి చేయూతనందించాలని మండల గ్రంథాలయాధికారి గోవిందు కోరారు. గురువారం మండల కేంద్రానికి చెందిన నాగభూషణ జాతీయ నాయకుల చిత్రపటాలను గ్రంథాలయానికి వితరణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు ఆయన్ను సన్మానించారు.

రైతు ర్యాలీ జయప్రదం చేయండి



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పుట్టపర్తి: పుట్టపర్తిలో శుక్రవారం తలపెట్టిన రైతు ర్యాలీ జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు గణేష్ సర్కిల్ నుంచి ప్రారంభమయ్యే కలెక్టరేట్ వరకు కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరవుతారన్నారు. రైతులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు పైసా సాయం అందించలేదన్నారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు చొప్పున అందిస్తామని రైతులను మోసగించిందన్నారు. ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కనగానపల్లి: రైతు సమస్యలపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి అన్నదాతలకు అండగా నిలవాలని రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో పాటు, ప్రభుత్వ హామీల అమలుపై నిలదీస్తామన్నారు. నియోజక వర్గంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో పాటు కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

చెన్నేకొత్తపల్లి: రైతుల సమస్యలపై శుక్రవారం పుట్టపర్తిలో జరిగే ర్యాలీకి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. మండలం నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



కదిరిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మాలధారులు



ధర్మవరంలో అయ్యప్పస్వామి చిత్రపటానికి పూజలు చేస్తున్న గురుస్వామి విజయ్‌కుమార్

కదిరి టౌన్: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 48వ మండల పూజ కార్యక్రమాల్లో భాగంగా గురువారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. అయ్యప్పస్వామి ఆలయంలో మహాగణపతి హోమం, అయ్యప్పస్వామికి 48 కేజీల నెయ్యితో అభిషేకం తదితర పూజలు చేపట్టారు. తర్వాత కన్యపూజ, పడి పూజ చేపట్టారు. అనంతరం ప్రత్యేక రథంపై అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రథాన్ని లాగి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణ పురవీధుల్లో అయ్యప్ప మాలధారులు శరణుఘోషతో ముందుకుసాగారు. కేరళ కళాకారుల వాయిద్యాల నడుమ గ్రామోత్సవం ఉత్సాహంగా సాగింది. పట్టణ ప్రజలు అయ్యప్పస్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్టవద్దనున్న శ్రీ అయ్యప్పస్వామి భజన మందిరంలో గురువారం గురుస్వామి పి.జె.విజయకుమార్ అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ముత్యాల పూలు, గంధంతో అలంకరించిన స్వామిని ఉంచి పూజలు చేపట్టారు. అనంతరం గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. వందలాది మంది విద్యార్థినులు, మహిళలు దీపాలు చేతపట్టుకుని స్వామికి స్వాగతం పలికారు. కేరళ కళాకారుల మంగళ వాయిద్యాల నడుమ పట్టణంలోని ప్రధాన రహదారుల్లో గ్రామోత్సవం సాగింది.

మున్సిపల్ కార్మికుల సమస్యలు తీర్చాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ధర్మవరం: మున్సిపల్ కార్మికుల సమస్యలు తీర్చాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు బాబు, కార్యదర్శి ముకుంద డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ పాఠశాలల ఆయాలు గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు, పాఠశాలల ఆయాలకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలలు, ఆయాల ఐదు నెలల వేతనాలను చెల్లించాలన్నారు. సమస్యలను తీర్చకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు లక్ష్మి, ఓబులేసు, ప్రసాద్, కేశవ, పెద్దక్క, సాలమ్మ, ముత్యాలమ్మ, ఓలప్ప, కార్మికులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు గురువారం నాలుగోరోజూ రిలే దీక్ష కొనసాగించారు. ఈసందర్భంగా సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు లియాఖత్, ఆదెప్ప తదితరులు వారికి మద్దతు ప్రకటించారు. 15 ఏళ్ల సర్వీసున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు క్రమబద్ధీకరణ చేయాలన్నారు. కనీస వేతనం రూ.29 వేలు అందించాలన్నారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారికి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు గంగాద్రి, నాయకులు వెంకటస్వామి, అల్తాఫ్, బాబునాయక్, రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించాలి

ఓడీచెరువు: విద్యుత్ బిల్లులను పెంపును ఉపసంహరించాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం విద్యుత్ బిల్లులను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు, సాధారణ, మధ్య తరగతి ప్రజలపైన పెనుభారం మోపుతూ విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు శ్రీనివాసులు, రమణ, వెంకటరంగారెడ్డి, మనోజ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి టౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తచెరువు ఏఈ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు. ఏఈకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు బాదుడే బాదుడు అనే కార్యక్రమాల ద్వారా ఆందోళనలు చేపట్టిన టీడీపీ నేతలు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్నారు. సీపీఎం మండల కార్యదర్శి బ్యాళ్ల అంజి, నాయకులు ముత్యాలు, నాగమణి, శ్రావణి, మహబూబ్‌బాషా, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వినతికీ పరిష్కారం చూపుతాం



పి కొత్తపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్



భూ సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీలు అందజేస్తున్న బాలేపాళ్యం రైతులు

బత్తలపల్లి: రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన ప్రతి వినతికీ పరిష్కారం చూపుతామని ధర్మవరం ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ స్వర్ణలత అధ్యక్షతన మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నలుగురు రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చుకున్నారు. గ్రామానికి చెందిన కొందరు మహిళలు పాతవూరులో వ్యక్తిగత మరుగుదొడ్డికి స్థలాన్ని కేటాయించాలని ఆర్డీఓకు విన్నవించారు. గతంలో ఇక్కడ సామూహిక మరుగుదొడ్డి ఉండేదన్నారు. దానిని అధికారులు తొలగించిన తరువాత గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్వాహా చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, మండల సర్వేయర్ జోసెఫ్, వీఆర్‌ఓలు రాణాప్రతాప్, చెన్నకేశవప్రసాద్, సాయిప్రకాష్, గ్రామ సర్వేయర్ ఆశాజ్యోతి పాల్గొన్నారు

తాడిమర్రి: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. చిల్లవారిపల్లిలోని గ్రామ సచివాలయంలో గురువారం ఆయన సిబ్బందితో కలసి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్ టవర్ కావాలని ఒకటి, పింఛన్ కోసం ఒకటి, వెబ్‌ల్యాండ్ నమోదుకు ఒకటి అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నల్లచెరువు: పి.కొత్తపల్లి గ్రామంలో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, కదిరి ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు భూ సమస్యలు, రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, వీఆర్‌ఓ జ్యోతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్పీకుంట: పి కొత్తపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్ గురువారం తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు సమర్పించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

చెన్నేకొత్తపల్లి: కొన్నేళ్లుగా నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పులేటిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పులేటిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు భూ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. విచారించి త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు సచివాలయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 28 అర్జీల స్వీకరణ

కనగానపల్లి: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 28 అర్జీలు వచ్చినట్లు స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. తహసీల్దార్ జీ.వీ. ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కనగానపల్లి, కోనాపురం, బాలేపాళ్యం గ్రామాల రైతులు, ప్రజలు హాజరై పలు సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. ఇందులో భూ సమస్యలపై 5, రేషన్‌కార్డుల కోసం 16, పింఛన్ల కోసం 9 మంది అర్జీలు అందజేసినట్లు గ్రామ రెవెన్యూ అధికారి మారుతి తెలిపారు.

పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమ



కదిరి అర్బన్: ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కే. రమ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పలమనేరు ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్ బ్రాంచ్‌లో హెచ్ఓడీగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

కాంగ్రెస్ మండల కన్వీనర్‌కు తీవ్ర గాయాలు

తనకల్లు: బీటీ క్రాస్ సమీపంలో గురువారం బైక్‌పై నుంచి కాంగ్రెస్ మండల కన్వీనర్ తోపు పారేసు తీవ్రంగా గాయపడ్డాడు. చీకటిమానిపల్లికి చెందిన తోపు పారేసు పారేసు కొక్కంటిక్రాస్‌లో పని ముగించుకుని బైక్‌పై బయలుదేరాడు. బీటీ క్రాస్ దగ్గరకు రాగానే అతని బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడ్డాడు. ఈ ప్రమాదంలో పారేసు ముఖానికి, తలకు బలమైన గాయాలయ్యాయి.

ఫ్యాక్షన్‌తో జీవితాలు నాశనం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్

బత్తలపల్లి: ఫ్యాక్షన్‌తో జీవితాలు నాశనమవుతాయని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఈదుల ముష్టూరులో వారు గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి కక్షలు పెట్టుకోవద్దని సూచించారు. గ్రామంలో గ్యాంబ్లింగ్, కోడిపందేలు, బెల్ట్‌షాపులు, మట్కా ఆడేవారి సమాచారం అందించాలన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో సిబ్బందితో కలిసి పల్లెనిద్ర చేశారు.

కదిరి అర్బన్: మొటుకుపల్లిలో గురువారం రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, ఫోక్సోయాక్ట్‌పై తదితర వాటిపై అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు, హోటళ్లు, దుకాణాలపై శానిటేషన్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. పశువుల ప్లాస్టిక్ కవర్లు తిని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి శివయ్య, సెక్రటరీ మోహన్, ఉమాశంకర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.